కేఎంసీలో తిష్ఠ




7

- ఉద్యోగం శానిటేషన్‌లో.. విధులు మరో చోట..
- అధికారులకు గుదిబండగా మారిన ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

5

ఆదివారం, 18 ఆగస్టు 2024



అన్నదాతకు వెన్నుదన్ను

వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిశోధనల్లోనూ మార్పులు చేస్తూ అనేక నూతన వంగడాలను రూపొందించడంలో మధిర వ్యవసాయ పరిశోధన స్థానం గత ఎనిమిది దశాబ్దాలుగా తనదైన పాత్రను పోషిస్తోంది. అధిక దిగుబడులను సాధించేలా, వివిధ రకాల తెగుళ్లను తట్టుకొనేలా వంగడాలను రూపొందించడంలో ఇక్కడి శాస్త్రవేత్తలు ముందంజలో ఉన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలను కొనసాగిస్తూనే, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ విద్యార్థులకు అందిస్తూ నూతన శాస్త్రవేత్తల తయారీలో ఈ స్థానం ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడి శాస్త్రవేత్తలు రూపొందించిన పెసర, కంది, జొన్న, పొగాకు, మినుము వంగడాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎంతో ఆదరణ వుంది. రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలనే లక్ష్యంతో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 1945లో ఏర్పాటైన ఈ స్థానం అనేక సమస్యలను అధిగమిస్తూ నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగుతోంది. - మధిర

- ఎనిమిది దశాబ్దాలుగా రైతుల సేవలో మధిర వ్యవసాయ పరిశోధన స్థానం
- నూతన వంగడాల తయారీలో తనదైన ముద్ర
- పెసర, మినుము, కంది, జొన్న వంగడాలకు ఎంతో ఆదరణ
- అధిక దిగుబడులు సాధించేలా, తెగుళ్లను తట్టుకొనేలా వంగడాల సృష్టి
- టీఎస్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌సీ, వివిధ కంపెనీల ద్వారా మేలైన విత్తనాల సరఫరా
- కొత్తగా ఎంజీజీ-389 పెసర, ఎంబీజీ-1080 మినుము రకాల విడుదలకు సిద్ధం

వివరాలు : 6లో



పంట చేలను తడపంగా..

- 'సీతారామ' ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులకు అంచనాలు
- రూ.4వేల కోట్లతో ప్రతిపాదనలు
- కొత్తగా 3,28,853 ఎకరాలకు సాగునీరందేలా నిర్మాణం
- వచ్చే సీజన్ నాటికి సాగునీరు అందించేందుకు కసరత్తు

ఖమ్మం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా రైతుల కలల రూపమైన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంయి మూడు పంపుహౌజ్‌లను ప్రారంభించి సత్తుపల్లి లింక్ కెనాల్‌తో గోదావరి, కృష్ణా జలాలను అనుసంధానం చేయడంతో రాబోయే సీజన్ నాటికి పలు నియోజకవర్గాల్లో ఆయకట్టుకు సాగునీరదించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. రూ.4 వేల కోట్ల అంచనాతో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులకు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే పరిపాలన మంజూరు తీసుకునేందుకు నీటిపారుదల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా మంత్రుల చొరవతో సీతారామ ప్రాజెక్టుకు రూ.90 కోట్లు మంజూరై లింక్ కెనాల్ పూర్తిచేయడంతో ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు పంపుహౌజ్‌లను ప్రారంభించి గోదావరి జలాలను విడుదల చేశారు. ఇప్పటి వరకు ప్రధాన కాలువకు సంబంధించి మాత్రమే సుమారు 140 కి.మీ. వరకు పనులు పూర్తయ్యాయి.

గత ప్రభుత్వం పెట్టిన రూ.8వేల కోట్లు వృధా కాకుండా సద్వినియోగంలోకి తెచ్చి ఈ ఏడాది వానాకాలంలో సాగర్‌నీరు రాకపోయినా వైరా రిజర్వాయర్‌కు తరలించడం ద్వారా వైరా,సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో లక్షా 25 వేల ఎకరాలకు నీరందించాలని ప్రక్రియ పూర్తిచేశారు. అయితే కృష్ణా ఎగువన కురిసిన వర్షాలతో సాగర్‌కు నీరు రావడంతో ప్రస్తుతానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలలో పనిలేకుండానే కృష్ణాజలాలతో పంటలు పండించే అవకాశం రైతులకు కలిగింది. వాస్తవానికి జూన్‌నెల నాటికే సీతారామ పూర్తయి ఉంటే ఆ నీళ్లతోనే రైతులు నాట్లు వేసుకుని పంటను నెలరోజుల ముందుకు తీసుకెళ్లే అవకాశం కలిగేది. అయితే రాబోయే సీజన్‌కు జూన్‌లో గోదావరిలో నీరు రాగానే సాగర్ ఆయకట్టు కింద నీరిచ్చే సౌలభ్యం కలగబోతుంది.

ప్రస్తుతం గోదావరి ప్రధాన కాలువ వెంట ఉన్న పినపాక, కొత్తగూడెం, వైరా, అశ్వారావుపేట, తదితర నియోజకవర్గాల్లో ఆయకట్టును వచ్చే సీజన్‌లోనే సాగునీరిచ్చే లక్ష్యంతో నీటిపారుదల శాఖ రూ.4వేల కోట్లతో ఆయా నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా తుది కసరత్తు ఇచ్చి, ప్రభుత్వం నుంచి పరిపాలన మంజూరు ఆవెంటనే టెండర్లకు వెళ్లబోతున్నారు. ఇప్పటికే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులపై సత్వరం అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు కూడా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం జరిగితే తమ నియోజకవర్గాలకు వచ్చే సీజన్‌కు నీర్చిచ్చే అవకాశం ఉంటుందని అధికారులపై వత్తిడి పెంచారు.

పినపాక నియోజకవర్గంలో 15665 ఎకరాలు, కొత్తగూడెం నియోజకవర్గంలో 35,082, అశ్వారావుపేటనియోజకవర్గంలో సుమారు లక్ష ఎకరాలు, ఇల్లెందు నియోజకవర్గంలో 6370, సత్తుపల్లి నియోజకవర్గంలో 4071, వైరా నియోజకవర్గంలో 70,508, ఖమ్మం నియోజకవర్గంలో 27,226, పాలేరు నియోజకవర్గంలో 24778, డోర్నకల్ నియోజకవర్గంలో 3వేల ఎకరాలకు సాగునీరించేందుకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు. కొత్తగా 3,28,853 ఎకరాలకు సాగునీరందేలా ఉపకాలువలు నిర్మాణం కాబోతున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రధాన కాలువకు రెండువైపులా డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇవి ముందుగా పూర్తిచేసుకుంటే వచ్చే సీజన్‌లో పినపాక, కొత్తగూడెం చఅశ్వారావపేట, వైరా నియోజవర్గాల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ద్వారా నీరిచ్చే అవకాశం ఉంది. పాలేరు ట్రంక్ పూర్తయితే ఖమ్మం, పాలేరు డోర్నకల్ నియోజకవర్గాలకు సాగునీరందనుంది. సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తిచేస్తేనే ఆ నియోజకవర్గానికి నీటి సదుపాయం వెళ్లే అవకాశం ఉంది. ఈ ట్రంక్‌లు పూర్తికావాలంటే 2026వరకు సమయం పట్టనుంది. అయితే ఇవి ముందుగా ప్రధాన కాలువ వెంట నీరు పారే ప్రాంతంలో డిస్ట్రిబ్యూటరీ గేట్లు ఏర్పాటుచేసి కెనాల్స్ పూర్తిచేయడం ద్వారా కొత్త ఆయకట్టుకు రాబోయే సీజన్‌లో సాగునీరు అందే అవకాశం ఉంది. ఎక్కువగా గిరిజన గ్రామాల రైతుల భూములు మెట్టభూములు ప్రధాన కాలువ వెంట ఉన్నాయి. సీతారామ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న 4,45,000 పైగా ఎకరాల ఆయకట్టు కూడా గోదావరి జలాలతో స్థిరీకరణ కానుంది. ఇందులో సాగర్ ఆయకట్టు కింద ఉన్న సాగుభూములు కూడా స్థిరీకరణ కాబోతున్నాయి. మొత్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.74 లక్షల ఎకరాలకు ప్రస్తుతం సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

అయితే వచ్చే ఏడాది కనీసం ఎన్ఎస్‌పీ ఆయకట్టు ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా లక్షా 25వేల ఎకరాలతోపాటు ప్రధాన కాలువ వెంట ఉన్న నియోజకవర్గాల్లో సాధ్యమైనంత వరకు ఎక్కువ ఆయకట్టుకు నీరందించేలా నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తుంది. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కోసం సుమారు 10వేల ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. మరో 360 ఎకరాల అటవీ భూమి కూడా సేకరించాలి. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ తవ్వకాలు జరగాలంటే భూసేకరణ కూడా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని రైతులతో చర్చించి పనులు చేపడితే సత్వరం సాధ్యమయ్యే అవకాశం ఉంటుంది.

ఇద్దరు అధికారుల సరెండర్


డీపీవో, డీఎంహెచ్‌వోను విధుల నుంచి తప్పించిన కలెక్టర్





ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 17: ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి ఇ. హరికిషన్‌ను, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాలతిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హరికిషన్ పంచాయతీ కార్యాలయంలో మహిళ ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై మహిళా ఉద్యోగులు మనస్తాపంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆయనను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి స్థాయిలో పంచాయతీ అధికారి వచ్చేంత వరకు ప్రస్తుతం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మికి పంచాయతీ అధికారిగా పూర్తి అదనపు బాధ్యలను అప్పగించారు.

ప్రైవేటు ఆసుపత్రులపై అజమాయిషీ లేకపోవటం డెంగ్యూ కేసులు పెరుగుతున్నా చర్యలు తీసుకోకపోవటం విధినిర్వహణలో అలక్షంగా వ్యవహరిస్తున్నారన్న కారణాలతో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మాలతిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌కు సరెండర్ చేశారు. శుక్రవారం ఆరోగ్యశాక కమిషనర్ ఆర్.వి. కర్ణణ్ పర్యటనలో డెంగ్యూ కేసుల నమోదు, రోగులకు చేయాల్సిన పరీక్షలలో లోపాలు, సేవల్లో లోపాలు కనిపించటంతో ఆయన ఒకింత అసహనానికి గుర్రైయ్యారు. తిరుమలాయపాలెం మండలంతోపాటు పలు గ్రామాల్లో డెంగ్యూ కేసులు నమోదౌతున్న చర్యలు తీసుకోవటంలో జిల్లా ఆర్యోగ్యశాఖ వైఫల్యం స్పష్టమౌటంతో కలెక్టర్ ఆమెను సరెండర్ చేశారు. ప్రస్తుతం ఖుష్టు నియంత్రనాధికారి గా పనిచేస్తున్న డాక్టర్ వరికూటి సుబ్బారావుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ ముజామిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీచేశారు.



రుణమాఫీ వెతలు

రూ. 2 లక్షల పంట రుణాల మాఫీ... 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది..' అన్న చందంలా మారింది. రైతులకు గుదిబండగా మారింది. పంట రుణం రూ.2లక్షలకుపైగా ఉన్నరైతులకు రూ.2 లక్షల వరకే మాఫీ వర్తిస్తున్నందున.. రూ.2లక్షలపైన ఉన్న మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని, అప్పుడే మాఫీ జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. దీంతో రూ.2 లక్షలకు మించి రుణాలు ఉన్నరైతులు మాఫీ కోసం అప్పులబాట పడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడులకే అప్పులు అంతంత మాత్రంగా లభిస్తున్న పరిస్థితుల్లో రూ.2 లక్షల మాఫీ పొందాలనే తాపత్రయంతో అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో వైరా సహా అన్ని ప్రాంతాల్లోని బ్యాంకుల్లో రూ.రెండులక్షలపైన ఉన్న రుణాలను చెల్లిస్తున్నారు.

- రూ.2లక్షల పైన రుణం వున్న వారికి నిబంధనల లంకె
- అదనంగా వున్న అప్పు చెల్లిస్తేనే రూ.2లక్షల రుణమాఫీ వర్తింపు
- సర్కారు రూలుతో అప్పుల కోసం రైతుల తిప్పలు
- పెట్టుబడుల వేళ అధిక వడ్డీల భారం
- అప్పు మొత్తంతో సంబంధం లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని వినతి

వైరా, ఆగస్టు 17: 2018 డిసెంబరు 12 తర్వాత 2023 డిసెంబరు 9లోపు రుణాలు తీసుకున్న 25 వేల కుటుంబాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది రైతు ఖాతాలకు రూ.31వేల కోట్లు జమచేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంగా ప్రకటించిన విషయం విదితమే. ఈ నెల 15 నాటికి రాష్ట్రంలోని 22లక్షల 37వేల 848 మందికి రూ.17,933 కోట్లను మూడు విడతల్లో రూ.2 లక్షల రుణమాఫీ కింద జమ చేశారు. ఇంకా దాదాపు 20 లక్షల మంది రైతులకు రూ.13 వేల కోట్ల పైచిలుకు నిధులను రుణమాఫీ కింద చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటికే మూడు విడతల్లో రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల్లో వివిధ కారణాల వలన రుణమాఫీ రాకపోతే అలాంటి వారికి అమలు చేస్తామని అలాగే రూ.2 లక్షలపైనున్న రుణాలను బ్యాంకుల్లో జమచేసిన రైతులకు నాలుగోవిడతలో అమలుచేస్తామని తుమ్మల ప్రకటించటంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు.

(మిగతా 6వ పేజీలో)




వైద్యురాలిపై హత్యాచారం హేయం

- సభ్య సమాజం సిగ్గుపడే ఘటన అది
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఐఎంఏ నాయకుల డిమాండ్
- నగరంలో వైద్యసిబ్బంది ర్యాలీ
- ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్ చేసి నిరసన

వివరాలు : 6లో

నేడు సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు



ఖమ్మం ఖానాపురం హవేలి ఆగస్టు 17: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఆదివారం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి జ్యోతి తెలిపారు. కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశాలతో ఆదివానం ఉదయం 9 గంటలకు నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీసీ కులస్తులు, బీసీ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రాఖీ పండుగకు వెళ్తూ..

- లోయలో పడిన ద్విచక్ర వాహనం
- కొడుకు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు



గుండాల, ఆగస్టు 17: తండ్రికి జ్వరం వస్తుండగా పరామర్శించడంతో పాటు సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్తున్న క్రమంలో ఓ కుటుంబంలో విషాదం నిండింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు పిల్లలతో పాటు భార్యతో పయనమై వెళ్తుండగా పాలగండిపై వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయిన ఘటనలో కొడుకు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలైయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని మటంలంక గ్రామానికి చెందిన కల్తి వెంకటేశ్వర్లుకు బయ్యారం మండలం లక్ష్మీపురం గ్రామంలోని తన మామకు జ్వరం వస్తుందని తెలిసింది. దీంతో పరామర్శించేందుకు, రాఖీ పండగ నేపథ్యంలో భార్యా సౌదర్య, కొడుకు నిరధీష్(7), కూతురు నేహాలతో శుక్రవారం సాయంత్రం చెట్టుపల్లి మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో పాలగండి ప్రాంతంలో వాహనం అదుపు తప్పింది. రోడ్డుదిగి ఓ బండను ఢీకొట్టగా ఆనలుగు అక్కడే పడిపోగా ద్విచక్రవాహనం లోయలోకి వెళ్లిపోయింది. దీంతో ఆ నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చాలా సేపటి తర్వాత అటుగా వచ్చిన వాహనదారులు గమనించి వారిని ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి ఖమ్మం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయాలైన వెంకటేశ్వర్లు, సౌదర్య, నేహా చికిత్స పొందుతుండగా, కొడుకు పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలిస్తుండగా సూర్యాపేట సమీపంలో మృతి చెందాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లిదండ్రులకు వారి కొడుకు మరణ వార్త కూడా తెలియని పరిస్థితి నెలకింది. కన్న కొడుకు చివరి చూపునకు కూడా వారు నోచుకోలేదు.

తల్లాడ వాసికి పోలీస్ మెడల్

సీఎం నుంచి పురస్కారం అందుకున్న ఏసీపీ నర్సింహారావు

తల్లాడ, ఆగస్టు 17: ప్రభుత్వ ఉద్యోగ నిర్వహణలో అత్యుత్తమ సేవలందించటంలో తల్లాడ మండలానికి చెందిన అధికారులు ఆదర్శంగా నిలిచారు. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో అత్యుత్తమ సేవలందించినందుకుగానూ తల్లాడ మండలానికి చెందిన అధికారులు ఉత్తమ సేవ పురస్కారాలు, మెడల్స్‌ను పొందారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గోల్కొండ కోటలో జరిగిన వేడుకల్లో తల్లాడ పట్టణానికి చెందిన ఏసీపీ పూనాటి నర్సింహారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. 1995లో నర్సింహారావు పోలీస్ సబ్ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. తదుపరి నర్సింహారావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, ప్రస్తుతం మియాపూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినందుకుగానూ నర్సింహారావుకు 2004, 2007సంవత్సరాల్లో పోలీసు కఠిన సేవ పతకాలను పొందారు. ప్రస్తుతం ఇండియన్ పోలీస్ గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు. మండలానికి చెందిన జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.అజయ్‌కుమార్, మణుగూర్ ఎంపీడీవో తేళ్లూరి శ్రీనివాసరావు, భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కత్తి రమేష్, కలెక్టరేట్‌లో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న నారపోగు అరుణ, కూసుమంచి డీఆర్వోగా పనిచేస్తున్న కటికి వెంకటరామారావుకు ఉత్తమ సేవ పురస్కారాలు లభించాయి.



సీఎం నుంచి పోలీస్ మెడల్ అందుకుంటున్న నర్సింహారావు

గాంధీచౌక్‌లో 'ట్రాఫిక్' దందా

- వాహనం నిలిపితే చాలు మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే...
- అక్కడ డ్యూటీ కోసం సిబ్బంది తహతహ
- రోజూ కనీసం రూ.3వేల సంపాదనతో ఇంటికి...

ఖమ్మం క్రైం, ఆగస్టు 17: ఖమ్మం నగరంలో ట్రాఫిక్ విభాగం దారి తప్పుతోందా..? ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాల్సిన సిబ్బంది, అసలు పనులకు బదులు అమ్యామ్యాల యావలో పడిపోయారా..? కొంతకాలంగా కనిపిస్తున్న పరిస్థితులు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలను ఇస్తున్నాయి. ట్రాఫిక్ విభాగంలోని కొందరు సిబ్బంది తీరు.. పోలీసుశాఖకు మచ్చ తెచ్చే విధంగా ఉంది. నగరంలో గతంలో వాహనాలను నిలిపి వసూలు చేసేవారని, కానీ ఇప్పుడు ఆగి ఉన్న వాహనాల నుంచి వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కన లారీ ఆపి సరుకు దింపాలంటే ట్రాఫిక్ సిబ్బందికి లారీకి ఒక రేటు, షాపుకు ఒక రేటు చొప్పున డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తునారని సమాచారం. విధులు నిర్వహిస్తున్న కొందరు రోజుకు సుమారు రూ.3 వేలు జేబులో పెట్టుకుని వెళ్లే విధంగా టార్గెట్ పెట్టుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఇది నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న హోల్ షాపుల వద్ద జరుగుతున్న దందా.

బండి ఆగితే రూ.200...

గ్రామీణ ప్రాంతాలలో కిరాణా దుకాణాలు నడుపుకునే వారికి, ఇంట్లో కిరాణా సరుకులు కావాల్సిన వారికి మెదట గుర్తు వచ్చే ప్రాంతం గాంధీచౌక్. ఈ ప్రాంతంలోని హోల్‌సేల్ షాపులలో నిత్యం విక్రయాలు పెద్దఎత్తున సాగుతుంటాయి. అక్కడ సరుకు దించుకునేందుకు షాపుల యజమానులు వాహనాలను రోడ్డు పక్కన ఆపుతుంటారు. ఆ సమయంలో అక్కడ విధులలో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది వాహనం ఆగి ఉన్న షాపు వద్దకు వచ్చి అల్లం తీసుకొచ్చిన లారీకి రూ.200, ఎల్లిపాయల లారీకి రూ.200, ఉల్లిగడ్డల లారీకి రూ.100 మాములు ఇవ్వాల్సిందేనని యజమానులను ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. ఇది గత కొన్నేళ్ళుగా సాగుతున్నప్పటికీ, చేసేదేమీ లేక యజమానులు మామూళ్లు ఇస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారి షాపుల ముందు వాహనాలు నిలిపితే వెంటనే వారి వద్దకు ట్రాఫిక్ సిబ్బంది వెళ్ళి వాహనాలను పంపిస్తున్నారని చెబుతున్నారు.

అక్కడ డ్యూటీకి ఎంతో డిమాండ్...

'సార్ ఇవ్వాళ నాకు గాంధీచౌక్‌లో డ్యూటీ వేయండి ప్లీజ్... కొంచె ఖర్చులు ఉన్నాయి... మా ఇంట్లో ఫంక్షన్ ఉంది సరుకులు తీసుకోవాలి..' అంటూ కొందరు సిబ్బంది బతిమలాడుకుని మరీ అక్కడ డ్యూటీలు వేయించుకుంటున్నారనే అభిప్రాయాలున్నాయి. గాంధీచౌక్‌లో విధులు నిర్వహించాలంటే అధికారుల నుండి సిఫారసులు సైతం జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఉండి తిరిగి ఇంటికి వెళ్ళే సమయానికి సుమారు రూ.3వేలు వసూలు చేసుకొని వెళుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ వచ్చిన డబ్బులు విధులు నిర్వహించిన వ్యక్తికే కాకుండా, ఆ ప్రాంతంలో విధులు నిర్వహించే మరో ఐదుగురు కూడా పంచుకుంటున్నట్టు సమాచారం.

హమాలీపై దాడి..

లోడ్ దించేందుకు వచ్చిన లారీని పక్కకు తీసేందుకు వచ్చిన ఓ హమాలీపై ఓ కానిస్టేబుల్ దాడి చేసిన సంఘటన శనివారం గాంధీచౌక్‌లో జరిగింది. ఉల్లిగడ్డల లోడ్‌ను దిపేందుకు లారీ ఓ దుకాణం ముందు నిలపగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో అక్కడ ఉన్న ఓ కానిస్టేబుల్ వచ్చి లారీని పక్కకు పెట్టిస్తున్న హమాలీ పై దాడి చేశాడు. దీంతో హమాలీ ముక్కు పగిలి రక్తం వచ్చింది. ఈ ఘటనపై యజమానులు తిరగబడటంతో ఆ కానిస్టేబుల్ గాయపడిన హమాలీని ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయం ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 17: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యాలయాన్ని నగరంలోని జమ్మిబండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎస్‌జీఎఫ్‌కు ప్రత్యేక కార్యాలయం కోసం ఎదురు చూసిన వ్యాయామ ఉపాధ్యాయులకు, పాఠశాల స్థాయి విద్యార్థులకు, క్రీడాకారులకు ఈ కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. క్రీడాకారులకు సౌకర్యంగా ఉంటుందని, ఎస్‌జీఎఫ్ కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యాలయాన్ని వ్యాయామ ఉపాధ్యాయులు, మరికొంత మంది దాతల సహకారంతో సుందరీకరణ చేసి మనుగడలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి షఫీ, వ్యాయామ ఉపాధ్యాయులు, నర్సింహారెడ్డి, రమణ, శ్యాం, రామారావు తదితరులు ఉన్నారు.



ఎస్‌జీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఈవో సోమశేఖరశర్మ,

18ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 17: షెడ్యూల్ ప్రకారం కార్యాచరణ చేసి, ఓటరు జాబితా సవరణ పూర్తి చేస్తామని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ సీఈవో కార్యాలయం నుంచి అదనపు సీఈఓ లోకేష్ కుమార్‌తో కలిసి ఓటరు జాబితా సవరణ- 2025 పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, వైరా ఆర్వో, నేలకొండపల్లి తహసీల్దార్, ఇఆర్వో ఖాళీల విషయమై సీఈవోకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మండలాల వారిగా దరఖాస్తులను సోమవారం సాయంత్రం లోగా ఆన్‌లైన్‌లో బీఎల్వో క్షేత్ర పరిశీలనకు పంపించాలని అన్నారు. రోజువారి దరఖాస్తుల పరిష్కార ప్రగతిని సమర్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ఎన్నికల విభాగ డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల అంశంపై తగిన చర్యలు

జిల్లాలో పోడు భూముల సమస్య శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), అటవీశాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, శాసనసభ్యులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోడు భూముల పట్టా కోసం గతంలో అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులు గుర్తించి క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల సమన్వయంతో సమగ్ర విచారణ జరిపి కమిటీల ద్వారా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా అటవీ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అటవీ అనుమతులు రహదారుల నిర్మాణాలతో పాటు అడవుల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, అటవీ అభివృద్ధి అధికారిమంజుల, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న సీఈవో



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉప ముఖ్యమంత్రి భట్టి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 17: దశబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్‌శాఖ ఉద్యోగులకు డిప్యూటీ సీఎం, భట్టి విక్రమార్క, సీఎండీ వరుణ్‌రెడ్డి సూచనలతో వందలాది మంది జేఎల్‌ఎంలకు ఏఎల్‌ఎం లుగా ప్రమోషన్లు దక్కాయని ఉద్యోగ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జూనియర్ లైన్ మ్యాన్‌లను అసిస్టెంట్ లైన్‌మ్యాన్లుగా విద్యుత్‌శాఖ ప్రమోషన్లు కల్పించటంతో శనివారం ఖమ్మం ఎస్ఈ కార్యాలయంలో ప్రభుత్వ కృతజ్ఞత సభను నిర్వహించారు. భట్టి విక్రమార్క ఫ్లెక్సీకి పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ తక్కెళ్లపల్లి శేషగిరిరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వారికి ఒకే సారి వందల సంఖ్యలో ప్రమోషన్లు ఇవ్వటం విద్యుత్‌శాఖలో ఒక చరిత్రగా మిగిలిపోతుందన్నారు. నాయకులు సీతారాం, గోపాల్, ఎం ప్రసాద్, శ్రీనివాస్, సురేశ్, శ్రీధర్, జీవీఎస్ఎస్ శ్రీనివాస్, రమేశ్‌బాబు, ముకుందరెడ్డి, పుష్పరాణి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం ఉద్యమిద్దాం

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎక్సైజ్ సీఐ కృష్ణ

ఖమ్మంటౌన్, ఆగస్టు 17: డ్రగ్స్ మాదకద్రవ్యాల రహిత తెలంగాణా కోసం ఐక్యమంగా ఉద్యమిద్దామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎక్సైజ్ సీఐ బి. కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా సాగుతోందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డ్రగ్స్ వాడకం ద్వారా యువత నిర్వీర్యం అవుతున్నదని,ఎంతో భవిష్యత్ ఉన్నవారు డ్రగ్స్ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. డ్రగ్స్ వాడకాల వల్ల వచ్చే దుష్ఫలితాలపై అవగాహన కల్పించాలని, అందుకు పలు కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను తరిమికొట్టేందుకు అందరం ఐక్యంగా పనిచేసి, ఉద్యమించాలన్నారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ బీ. కృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియా ముఖ్యంగా విద్యార్థులను, యువతను లక్ష్యంగా పెట్టుకొని, వారికి డ్రగ్స్ అలవాటు చేసి వ్యాపారం చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. తమ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడితే తమకు తెలియచేయాలని, వెంటనే కౌన్సెలింగ్ చేస్తామన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తల్లిదండ్రులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థల్లో యాంటీడ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, డ్రగ్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తామని, విద్యాసంస్థలు, అధికారులు, రాజకీయాలకు అతీతంగా అందరూ తమకు సహకరించాలని కోరారు. ప్రముఖ మానసికవైద్యుడు సతీష్‌బాబు, డాక్టర్ భారవి, ఫిజియోథెరపిస్టు అనిల్, రైతుసంఘం రాష్ట్రనాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో డ్రగ్ డీ ఎడక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రయివేట్ జూనియర్ కళాశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు, టెస్మా నాయకులు డ్రగ్స్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తమ సహకారం అందిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు తుడుం ప్రవీణ్, బషీరుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు సుధాకర్, ప్రభాకర్, నాయకుల చింతల రమేష్, సంగీత, సత్య, శీలం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రుణమాఫీ వెతలు

(5వ పేజీ తరువాయి)

2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంటరుణాల చెల్లింపును రద్దు చేసిన తరహాలోనే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ అమలుచేస్తారని ఆశించిన రైతులకు భంగపాటే ఎదురైంది. ప్రభుత్వ నిబంధనలు ఒకరకంగా రైతుల పాలిట శాపంగా మారాయి. బ్యాంకుల్లో తమకు ఎంత రుణం ఉన్నప్పటికీ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని అమలుచేస్తే తమకు వెసులుబాటు ఉన్న సమయంలో మిగిలిన మొత్తాన్ని చెల్లించి రుణవిముక్తులం అవుతామని, అలాకాకుండా మాఫీ మొత్తానికి అదనంగా రుణాలను చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని నిబంధనను విధించటాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు.

2007లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క నిబంధన లేకుండా రుణమాఫీ అమలు చేయడంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రతిష్ఠ రైతుల్లో ఇనుమడించింది. అయితే రాష్ట్రంలోని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో రూ.17,933 కోట్ల రుణమాఫీ చేసినప్పటికీ రైతుల్లో ప్రభుత్వ గ్రాఫ్ పెరగకపోగా తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోందనే అభిప్రాయాలున్నాయి. రుణమాఫీ ప్రభుత్వానికి నష్టదాయకమే తప్ప ఏమాత్రం లబ్ధిచేకూర్చేవిధంగా లేదని గ్రామాల్లోని కాంగ్రెస్ శ్రేణులు బహిరంగంగానే అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు.

నెలకు రూ.లక్షకుపైగా వేతనాలు తీసుకునే మహిళా ఉద్యోగులకు ఆర్టీసీ బస్సుల్లో ఎలాంటి నిబంధన లేకుండా ఉచిత ప్రయాణం కల్పిస్తూ.. రైతుల రుణమాఫీ విషయంలో మాత్రం నిబంధనలు పెట్టడాన్ని కాంగ్రెస్ శ్రేణులు తప్పుబడుతున్నాయి. ఇప్పటికే రూ.రెండులక్షల రుణమాఫీ వచ్చిన రైతులు కూడా డిసెంబరు 9 తర్వాత నుంచి ఇప్పటివరకు బ్యాంకుల్లో వడ్డీ చెల్లించి తిరిగి మళ్లీ రుణాన్ని తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పుడు రూ.రెండులక్షలపైనున్న మొత్తాన్ని చెల్లించినప్పటికీ ప్రభుత్వం కొన్నినెలల తర్వాత రూ.రెండులక్షల రుణమాఫీ వర్తించే రైతులు ఇంకా ఎక్కువ నెలలకు డిసెంబరు 9 నాటి నుంచి బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఓవైపున బయట తీసుకువచ్చిన ప్రైవేట్ అప్పులకు అధిక వడ్డీ, ఇంకా కొన్నినెలల వ్యవధి గడుస్తున్నందున బ్యాంకులో ఉన్న రుణాలకు వడ్డీ చెల్లించాల్సి రావడంతో రైతులపై మరింత భారం పడనుంది. ప్రభుత్వం పునరాలోచించి రూ.రెండులక్షలపై రుణాలు ఉన్న రైతులకు వెసులుబాటు కల్పించి రుణమాఫీని వర్తింపజేసి భారం పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



ప్రయోగాత్మకంగా సాగైన పెసర పంట

అన్నదాతకు వెన్నుదన్ను


ఎనిమిది దశాబ్దాలుగా రైతుల సేవలో మధిర వ్యవసాయ పరిశోధన స్థానం

సండే స్పెషల్ SUNDAY SPECIAL

మధిర, ఆగస్టు 17: గత ఎనిమిది దశాబ్దాలుగా నాణ్యమైన, సమగ్రమైన విత్తనాలను రైతులకు అందించడంలో మధిర వ్యవసాయ పరిశోధన స్థానం ముందంజలో నిలుస్తోంది. 1945లో ఈప్రాంతంలో పొగాకు సాగు ఎక్కువగా ఉండటంతో శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. కాలక్రమేణా సాగు తగ్గడంతో 1961నుంచి మాగీజొన్నపై పరిశోధనలు జరిపారు. దశాబ్దకాలం తర్వాత 1971నుంచి అపరాల సాగును ప్రోత్సహిస్తూ పెసర, మినుము, కందిపై పరిశోధనలు జరిపి పలువంగడాలు రూపొందించి విడుదల చేశారు. మధిర స్థానం నుంచి విడుదలైన వంగడాలు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో , అంధ్రప్రదేశ్‌లోనూ ప్రాచుర్యం పొందాయి.

పరిశోధనలు ఇలా...

ప్రస్తుతం ఈ కేంద్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారు. ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి పర్యవేక్షణలో ఒక కీటక శాస్త్రవేత్త, ఒక సేద్యవిభాగ శాస్త్రవేత్త పరిశోధనలు జరుపుతున్నారు. దీనికి అనుబంధంగా వ్యవసాయ సాంకేతిక కళాశాల (అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల)2012లో మంజూరై ఎంతో మంది వ్యవసాయ విద్యార్థులను తయారుచేస్తుంది. ముఖ్యంగా ఈ పరిశోధనా స్థానంలో చీడపీడలను తట్టుకొనే రకాలను రూపొందించడమే కాకుండా, వివిధ పురుగుమందులు మీద, అపరాలలో నాన్‌డీఏపీ వాడకంపైనా, వివిధ కలుపు మందులపైనా, వరి మాగాణులకు అనుకూలమైన అపరాల సాగు మీద పరిశోధనలు జరుగుతున్నాయి.



నూతన వంగడాలు

మధిర పరిశోధన స్థానంనుంచి ఇప్పటివరకు పెసరలో 5 రకాలు ఎంజీజీ ఎంజీజీ-295, 348, 347, 351, 385 రకాలు, మినుములో ఎంబీజీ-207, 1070రకాలు, కందిలో ఎంఆర్‌జీ-66, 1004రకాలు, జొన్నలో కిన్నెర, మోతి రకాలు రూపొంది విడుదలచేశారు. ఈ రకాలన్నీ రాష్ట్రవ్యాప్తంగా ప్రాచు ర్యం పొందాయి. అంతేకాక ఈ విత్తనాలను అధిక మొత్తంలో ఉత్పత్తి చేసి రాష్ట్రంలో టీఎస్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌సీ, వివిధ కంపెనీలద్వారా రైతులకు అందజేస్తున్నారు.

విడుదలకు సిద్దంగా ఉన్న రకాలు...

ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులను ఇచ్చే పెసర, మినుము రకాలు విడుదలకు సిద్దంగా ఉన్నాయి. మధిర ఎంజీజీ-389 పెసర రకం, ఎంబీజీ-1080 మినుము రకాలు విడుదలకు సిద్దంగా ఉన్నాయి. మూడో ఏడాది చిరుసంచుల రూపంలో పరీక్షలు జరుగుతున్నాయి. ఈ యేడాది విడుదల చేయడం జరుగుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. పెసరలో ఎంజీజీ-453, మినుము ఎంబీజీ-1110 రకాలు మొదటి సంవత్సరం పరీక్షల నిమిత్తం చిరు సంచులు వివిధ జిల్లాలకు పంపడం జరిగింది. చిరు సంచుల పరీక్షలు పూర్తి కాగానే తెలంగాణలో విడుదల చేస్తారు. రాబోయే రోజుల్లో మధిర స్థానం నుంచి ఎంజీజీ-519 పెసర రకం, ఎంబీజీ-1133 మినుము రకం చేస్తామని ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవి తెలిపారు.

విత్తనోత్పత్తిలోనూ అగ్రస్థానం...

ఈ స్థానం విత్తనోత్పత్తిలోనూ రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంది. పెసర, మినుము విత్తనోత్పత్తి ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో రఘనాథపాలెం మండలం గణేశ్వరం, బొండ్యా తండా, చింతకాని మండలం, కొణిజర్ల, ఎర్రుపాలెం మండలం బు చ్చిరెడ్డిపాలెం, బస్వాపురం, కృష్ణాపురం గ్రామాల్లో రైతులు శాస్త్రవేత్తల పర్యవేక్షణలో విత్తనోత్పత్తి చేస్తున్నారు. ఈ రైతులకు బైబాక్ రూపంలో మార్కెట్ ధరకంటే ఎక్కువ ధర చెల్లించడం జరుగుతుంది. శాస్త్రవేత్తల పర్యవేక్షణలో నాణ్యమైన విత్తనోత్పత్తి జరుగుతుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పించడం, అవసరమైన శిక్షణ ఇస్తారు. ఈ విత్తనోత్పత్తి రైతులను విత్తన ధ్రువీకరణ సంస్థద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారు. పంట కాలంలో ఆ సంస్థకూడా పరిశీలించి అవసరమైన సూచనలు చేస్తుంది. ఈవిధంగా నాణ్యమైన విత్తనోత్పత్తి జరిగి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

విత్తనోత్పత్తి పెరుగుదల ఇలా..

గత ఐదు సంవత్సరాల్లో మధిర స్థానం ఆధ్వర్యంలో విత్తనోత్పత్తి గణనీయంగా పెరిగింది. 385 క్వింటాళ్ల నుంచి 1180క్వింటాళ్లవరకు ఉత్పత్తి పెరిగింది. ముఖ్యంగా పెసర, మినుము, కంది పంటలలో 2019-20లో 385 క్వింటాళ్లు, 2020-21లో 933 క్వింటాళ్లు, 2021-22లో 911 క్వింటాళ్లు, 2022-23లో 1000 క్వింటాళ్లు, 2023-24లో 1180 క్వింటాళ్లు విత్తనోత్పత్తి చేసి రాష్ట్ర రైతులకు అందించారు. ముున్ముందు కాలంలోనూ మంచి దిగుబడి, చీడపీడలను తట్టుకునే వంగడాలను పెసర, మినుములలో రూపొందించడం జరుగుతుందని, నాణ్యమైన విత్తనాలను రైతులకు సరఫరా చేసేందుకు కృషిచేస్తున్నట్లు రుక్మిణీదేవి తెలిపారు.

సగం పోస్టులు ఖాళీ...

రైతులకు అనేక రకాల సేవలందిస్తున్న మధిర పరిశోధనా స్థానం ఉద్యోగుల కొరతతో ఇబ్బందులుపడుతుంది. ప్రధాన శాస్త్రవేత్తతో కలిసి ఆరుగురు శాస్త్రవేత్తలు ఉండాల్సివుండగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. 3 శాస్త్రవేత్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే నలుగురు ఏఈవోలకు గాను ఇద్దరు ఉన్నారు. వారిలో ఒకరు అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నవారే. ఫీల్డు సూపర్‌వైజర్‌లు ముగ్గురికి గాను మూడు పోస్టులూ ఖాళీనే. ముగ్గురుని అవుట్ సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఏడబ్ల్యూఎం (అగ్రికల్చర్ వర్కర్స్)లు ఆరుగురు ఉండాల్సివుండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. టైంస్కేల్ వర్కర్స్ మాత్రం 28మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం కల్పించుకొని శాస్త్రవేత్తల పోస్టులు , ఇతర సిబ్బంది పోస్టులు భర్తీచేస్తే రైతులకు వ్యవసాయపరంగా మరింత సేవలందించేందుకు అవకాశం ఉంటుంది. ఆమేరకు ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీల సరఫరాకు అవకాశం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 17: రాఖీ పౌర్ణమి పురస్కరించుకోని ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలను పంపేందుకు అవకాశం కల్పించామని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏటీఎం టి. పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు, సోదరీమణులకు రాఖీలు పంపేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనురాగాన్ని, ఆప్యాయతను పంచుకునేందుకు సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పుకునేందుకు రాఖీలను పంపించాటానికి ఆసక్తి గలవారు ఆర్టీసీ కార్గో సర్వీస్‌ల ద్వారా బుకింగ్ చుసుకోవచ్చునని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని అన్ని బస్టాండ్స్, మండల కేంద్రాలలో ఈ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ రాఖీలను తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కడికైనా కేవలం రాఖీకి రూ.50లు చెల్లించాలని, స్వీట్ బాక్స్‌లకు బరువు ఆధారంగా , కిలో మీటర్ల ఆధారంగా రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన ప్రాంతాలకు రాఖీలు పంపుకునే అవకాశం ఉందని తెలిపారు. బుకింగ్ కొరకు 9154298582, 9154298583, 9154298585 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కల్లూరు, ఆగస్టు17: మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చర్చి ఫాదర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో పెద్దకోరుకొండి ఆర్సీఎం చర్చి విచారణ గురువులు జోజిబాబు రహదారిపై నుంచి కాలి నడకన చర్చి వైపునకు వస్తుండగా తెలగవరం మర్లపాడు గ్రామానికి చెందిన ఎన్ చిన్నపుల్లయ్య అనే వ్యక్తి మద్యం సేవించి ద్విచక్రవాహనంతో వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జోజిబాబును చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

వైద్యురాలిపై హత్యాచారం హేయం

● ఆస్పత్రుల్లో ఓపీ సేవల బంద్ చేసి నిరసన

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 17: డ్యూటీలో ఉన్న వైద్యురాలిని అమానుషంగా లైంగిక దాడి చేసి ఆపై దారుణ హత్య చేసిన సంఘటన దేశవ్యాప్తంగా కలకరం రేపుతోందని .. కానీ అక్కడి ప్రభుత్వం నిందితులను శిక్షించకుండా... నిరసన చేసిన వారిపై దాడులు చేయడం హేయనీయమని ఖమ్మం జిల్లా మెడికల్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ కె జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తాలో ఓ వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి , ఆపై దారుణ హత్యకు నిరసనగా జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ కంభంపాటి నారాయణరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వైద్యులపై ఇలాంటి సంఘటనలు జరగడం దారుణమన్నారు. ఈ ర్యాలీకి స్వచ్ఛందంగా అన్ని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, నర్సింగ్, ఆరోగ్య సిబ్బంది స్వచ్ఛందంగా తరలివచ్చారు.

శనివారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో ఓపిసేవలు నిలిపివేసి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఆస్పత్రుల్లో రోగులు అవస్థలు పడ్డారు. అత్యవసర రోగులకు మాత్రమే వైద్య సేవలను అందించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోనూ ఉదయం 11 గంటల వరకు గంటపాటు ఓపీ సేవలను నిలిపి వేసి వైద్యులు నిరసనలో పాల్గొన్నారు. అతర్వాత ఓపీ విభాగానికి చేరుకుని రోగులకు పరీక్షలను నిర్వహించారు. ప్రైవేటు ఆస్పత్రులో మాత్రం సాయంత్రం వరకు ఓపీ సేవలను నిలిపివేశారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ గుబ్బల స్వప్న, డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ కుసుమరాజు రవి, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ బొలికొండ శ్రీనివాసరావు, డాక్టర్ రెహానా బేగం, డాక్టర్ బాబూ రత్నాకర్ డాక్టర్ కెవీ కృష్ణారావు తో పాటు ఐఎంఏ మెంబర్స్ , జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్యులు, తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు, హోమియో వైద్యులు, దంత వైద్యులు, నర్సింగ్ అంబులెన్స్ డ్రైవర్లు, సిబ్బంది, కంపౌండర్లు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 17: దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి తీవ్రంగా ఖండించారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన పీవోడబ్ల్యూ నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గట్టయ్య సెంటర్‌లో ఉన్మాది దిష్టిబోమ్మను దహనం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు లలిత, శోభ,ఝాన్సీ వనతి, శారద, జాస్మిన్, ఉమా పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ఖండించారు. జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్, అధ్యక్షులు టీ లక్ష్మణ్, రాజేశ్వరి, మౌనిక, అనిత, అనూష, చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తగూడెంలో....

కొత్తగూడెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వైద్యులు, వైద్యసిబ్బంది, పారామెడికల్ సిబ్బంది శనివారం ఓపీ సేవలను నిలపివేశారు. జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తాలో పీజీ చదువుతున్న ట్రైనీవైద్యురాలిపై అత్యాచారం చేసిన ఘటనను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా పిలుపులో భాగంగా జిల్లాలో ఐఎంఎ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యులు ఓపీసేవలను 24గంటలపాటు నిలిపివేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జిల్లా ప్రభుత్వ వైద్యఆరోగ్య ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, పారామెడికల్ సిబ్బందితో 24గంటలపాటు ఓపీ వైద్య సేవలను నిలిపివేశారు. ఆసుపత్రి వద్ద ఆందోళన ర్యాలీ నిర్వహించారు. వైద్యులకు విధుల్లో ఉన్నప్పుడు ఎలాంటి సంఘటనలుజరగకుండ ఉండేందుకు ప్రత్యేకంగా నూతన చట్టాన్ని రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో కొత్తగూడెంతో పాటుగా భద్రాచలంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద ఐఎంఎ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన తెలిపారు. ఆ ర్యాలీలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ పాల్గొన్నారు. ఆందోళనకు తన మద్దతు తెలిపి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పలు మండలాల్లో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఓపీ సేవలను బంద్‌చేసి ర్యాలీలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

భద్రాద్రిలో 57,983మంది రైతులకు రుణమాఫీ

● కలెక్టర్ జితేష్ వి. పాటిల్



కొత్తగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీలో భాగంగా మూడు విడతల్లో 57,983 మంది రైతులకు రూ.415,34,84,332లు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందని కలెక్టర్ జితేష్ వి. పాటల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. మొదటి విడత రుణమాఫీలో 28,801మంది రైతులకు రూ. 136,64,86,132లు, రెండో విడతలో 17,309 మంది రైతులకు రూ.147,33,79,632లు, మూడో విడతలో 11,873 రైతులకు రూ.131,36,18,568లు రుణమాఫీ నగదు రైతుల ఖతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. వ్యవసాయం, సహకార శాఖ పంట రుణాలు రుణ మాఫీ 2024 ఫిర్యాదుల నమోదు, పరిష్కారానికి మార్గదర్శకాలు, సూచనలను కలెక్టర్ ప్రకటించారు.

సీడ్ విత్తనాలతో మోసపోయిన మొక్కజొన్న రైతులు

● వ్యాపారి, విత్తన కంపెనీ ప్రతినిధులను స్టేషన్‌లో అప్పగించిన అన్నదాతలు



వివరాలు వెల్లడిస్తున్న రైతులు

పెనుబల్లి, ఆగస్టు 17: మొక్కజొన్న విత్తనాలను తీసుకు వచ్చి సాగుచేసిన రైతులకు పంట దిగుబడి లేకపోవడంతో సంబంధిత కంపెనీ ప్రతినిధులను, వ్యాపారిని నష్టపరిహారం చెల్లించాలని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన సం ఘటన శనివారం మండలంలోని పార్థసారథిపురంలో చోటుచేసుకుంది. పార్థసారథిపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు 15ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఇందుకోసం విత్తనాలను గత మేనెలలో ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని సీడ్ దుకాణంలో కొనుగోలు చేసి విత్తారు. ఎదుగుదల కోసం దుక్కి, ఎరువులు, పురుగుమందులు ఎకరాకు రూ.60వేల చొప్పున సీపీ-333రకం విత్తనాలను కొనుగోలు చేసి సాగుచేశారు. మూడు నెలల్లో పంట చేతికి వచ్చి విక్రయించుకోవాల్సి ఉండగా పంట దిగుబడి లేదు. కంకుల్లో విత్తనం లేకుండా బెండు గా మారాయని, విత్తనాలు కూడా పూర్తిగా రాలేదని, కంకులు సైతం చిన్నగా ఉన్నాయని తాము విత్తనాలు వల్ల నష్టపోయామని రైతులు గుర్తించారు. దీంతో విత్తనాలు అమ్మిన వ్యాపారికి ఫిర్యాదు చేయగా, మీకు ఎలాంటి నష్టం రాకుండా కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పిస్తానని చెప్పాడు. కానీ గత 20రోజులుగా తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన రైతులు, శనివారం కంపెనీకి చెందిన వ్యాపారి పొలం వద్దకు రావడంతో నష్టపరిహారం ఇప్పించిన తర్వాతనే వెళ్లాలని రైతులు వత్తిడి చేశారు. వ్యాపారి, కంపెనీ ప్రతినిధులు కానీ సరైన సమాధానం చెప్పకపోవడంతో వీఎంబంజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంట నష్టం వలన మళ్లీ తాము సాగుచేసుకోవాల్సిన మిరప పంట ఆలస్యమవుతుందని తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకుడు గాయం తిరుపతిరావుతో కలిసి వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరాజుకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు మందా వెంకటేశ్వరరావు, పద్దం శివరావు, లింగనబోయిన రాఘవులు, పాలగాని వెంకటేశ్వరరావు, చావకుర్తి శ్రీనివాసాచారి తెలిపారు.

భద్రాద్రి ఫొటోగ్రాఫర్ షరీఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు



భద్రాచలం, ఆగస్టు 17: భద్రాచలానికి చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రఫర్ ఎస్‌కె షరీఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు లభించింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పౌర సంబంధాల ప్రచార శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పథకాల విభాగంలో అవార్డు అందుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసంబంధాల శాఖ నుంచి అవార్డు తీసుకునేందుకు రావాలని షరీఫ్‌కు పిలుపువచ్చింది. గతంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలుమార్లు ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా షరీఫ్ అవార్డులు, రివార్డులు దక్కించుకున్నారు.

జియోథర్మల్ ప్రాజెక్టును పరిశీలించిన జీఎం సైదులు

మణుగూరు, ఆగస్టు 17 : మణుగూరు మండలంలోని పగిడేరు గ్రామంలో ప్రతిపాధిత జీయో థర్మల్ ప్రాజెక్టును ఏరియా జీఎంతో పాటు జీఎం ఆర్‌అండ్‌డీ సైదులు శనివారం సందర్శించారు. రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మణుగూరు విచ్చేసిన సైదులుకు ఏరియా జీఎం ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో సమావేశం అయిన ఆయన పగిడేరు జీయోథర్మల్ ప్లాంట్ స్థితి గతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న టర్బైన్ మరమ్మతులను పరిశీలించారు. ఢిల్లీలో చేపట్టిన టర్బైన్ రీడిజైన్ పురోగతిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌డీ అదనపు మేనేజర్ ఎం. కనకయ్య, ఎస్‌ఓటూజీఎం డి. శ్యాం సుందర్, డీజీఎం ఐఈడి వెంకట్‌రావు, క్వాలిటీ వెంగళరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, పర్యావరణ అధికారి జే. శ్రీనివాసరావు, సినియర్ ఎకౌంట్స్ అధికారి మహేష్ తదితరులున్నారు.

భర్తపై భార్య దాడి

● నలుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు, ఆగస్టు 17: కుటుంబ సభ్యులతో కలిసి భార్య భర్తపై దాడికి పాల్పడిన సంఘటన శనివారం జూలూరుపాడు గ్రామములో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని నాగేశ్వరరావు, అతని భార్య సుజాతకు మనస్పర్థలు వచ్చాయి. దీంతో గత కొంతకాలం నుంచి ఆమె భర్తను విడిచి కుమారుడితో కలిసి వేరే గ్రామంలో ఉంటుంది.

ఈ క్రమంలో గతంలో మనస్పర్థలు ఉండటంతో భార్య సుజాత, కుమారుడు మనోజ్ కుమార్, కోడలు సంధ్య, అత్త గోపమ్మలు కలిసి జూలూరుపాడులోని నాగేశ్వరరావు ఇంటికి వచ్చారు. ఇంట్లో ఉన్న అతడిపై ఇనప రాడ్డుతో నలుగురు కలిసి దాడి చేశారు. ఈ సంఘటనలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు, దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాణా ప్రతాప్ తెలిపారు.

కేఎంసీలో తిష్ట



- 18విభాగాల్లో 1,013 మంది ఉద్యోగులు
- పోస్టు శానిటేషన్‌లో.. విధులు మరో విభాగంలో
- పారిశుధ్య నిర్వహణకు కార్మికులు కావాలని కార్పొరేటర్ల వినతి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 17: రోజు రోజుకు ఖమ్మం నగరం విస్తరిస్తోంది. ఆ మేరకు నివాసాలు, కుటుంబాలు పెరుగుతున్నాయి. జనాభా పెరుగుదలతో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ పెరుగుతోంది. పెరిగిన జనాభా కు తగిన విధంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను నగర పాలక సంస్థ పెంచుకోవాల్సి ఉంటుంది. అయి తే పలు కారణాలతో నగర పాల క సంస్థలో ఔట్ సోర్సింగ్, కారు ణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారు పారిశుధ్య పనులు చేసేందుకు ససేమిరా అంటున్నారు. కార్పొరేటర్లు, రాజకీయ నాయకులతో సిఫార్సులు చేయించుకొని నగరపాలక సంస్థ కార్యాలయంలోనే తిష్ట వేస్తున్నారు. రాజకీయ అండతో కేఎంసీలో కాలు పెట్టిన ఉద్యోగులు అధికారులకే గుదిబండగా మారారనే విమర్శలు వెలువడుతున్నాయి.

1,013కు చేరిన ఉద్యోగుల సంఖ్య

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వశాఖల ఉద్యోగుల సంఖ్యకు దరిదాపుల్లోకి చేరింది. కేఎంసీకి వచ్చే ఆర్థిక బడ్జెట్ నిధుల్లో 40శాతానికి పైగా ఉద్యోగుల వేతనాలకే సరిపోతుందని పాలకవర్గం తల పట్టుకుంటున్నారు. ఏ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఏ విభాగంలో ఏ ఏ పనులు చేస్తున్నారో తెలియని పరిస్థితి కేఎంసీలో ఏర్పడింది. శానిటేషన్ కార్మికులు-548, ఫాగింగ్ కార్మికులు-23, స్వచ్ఛ భారత్ ఆటో డ్రైవర్లు 29, శానిటరీ జవాన్లు-4, గార్డెన్ కార్మికులు-68, ఆఫీస్ స్టాఫ్-5, లైబ్రెరియన్స్-3, వాటర్ సప్లయ్ కార్మికులు-2, డ్రైవర్లు-6, ట్రాక్టర్ డ్రైవర్లు-26, ఫొటోగ్రాఫర్-1, ఎలక్ట్రీషియన్లు-27, వాటర్ సప్లయ్ కార్మికులు-123, ఆఫీస్ స్టాఫ్-21, శానిటరీ జవాన్లు-44, గార్డెన్ పర్యవేక్షకులు 4, కంప్యూటర్ ఆపరేటర్లు-25, టెక్నికల్ సూపర్‌వైజర్లు-13, హేవీ వెహికల్ డ్రైవర్లు-5, స్కిల్డ్ కార్మికులు-7, డీఆర్ఎఫ్-20, ఎల్ఆర్ఎస్ టెక్నికల్-4, రిటైర్డ్ ఎంఆర్వో-1, రిటైర్డ్ హార్టీకల్చర్ అధికారి-1, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్-1, మున్సిపల్ స్టాండింగ్ సిబ్బంది-2, 18 విభాగాల్లో మొత్తం 1,013 మంది ఉద్యోగులు కేఎంసీ నుంచి వేతనాలను పొందుతున్నారు. కాగా వీరిలో ఆఫీస్ స్టాఫ్ పేరుతో-26 మంది, ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు-25 మంది, ప్లానింగ్ నుంచి ఎల్ఆర్ఎస్ మరో-10 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర విభాగాల్లో ఖాళీగా తిరుగుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రక్షాళన దిశగా కార్యాచరణ

గత కౌన్సిల్ సమావేశంలో పారిశుధ్య కార్మికుల అవసరంపై పలువురు కార్పొరేటర్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సంఖ్యను పెంచాలని కార్పొరేటర్లు కోరారు. దీంతో మంత్రి తుమ్మల ఆదేశాలతో స్పందించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేసే ఉద్యోగుల లెక్కల బయటకు తీస్తున్నట్లు సమాచారం. కేఎంసీలో అవసరాల మేరకు ఉంచి, మిగిలిన ఉద్యోగులను పారిశుధ్య పనులకు పంపేందుకు ప్రక్షాళన ప్రారంభించినట్లు తెలుస్తోంది.

రాజకీయ అండతో...

కేఎంసీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు మరణిస్తే వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పిస్తారు. ఏ విభాగంలో ఉద్యోగి మరణిస్తే ఆదే విభాగంలో తిరిగి ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రాజకీయ అండతో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహించేందుకు ముందు కు రావడం లేదు. ఏదో కంప్యూటర్ ధ్రువపత్రాలను తీసుకొచ్చి కంప్యూటర్ అపరేటర్లు, ఆఫీస్ సబార్డినేట్‌లు, ఇతర విభాగాల్లో ఉద్యోగాల్లో చేరుతున్నారు. దీంతో పారిశుధ్యంలో కొరత ఏర్పడి కేఎంసీలో ఉద్యోగుల సంఖ్య భారీగా పెరుగుతుంది. రాజకీయ అండతో చేరిన వారు అధికారులకు గుదిబండగా మారుతున్నారు. అసిస్టెంట్ కమిషనర్ స్థాయి కలిగిన అధికారులు చెప్పిన పనులను కూడా ఖాతర్ చేయడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.

హైకోర్టు న్యాయమూర్తి శరత్‌ని కలిసిన సీపీ



న్యాయమూర్తికి మొక్కను బహూకరిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు17: జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తిని శనివారం పోలీసుకమిషనర్ సునిల్‌దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి కె.శరత్ నగరంలోని ఎన్ఎస్‌పీ గెస్ట్‌హౌస్‌లో ముందుగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మొక్కను అందించారు.

ఖమ్మం కోర్టును సందర్శన

ఖమ్మం లీగల్ ఆగస్టు 17: ఖమ్మం నగరంలో శనివారం ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన హైకోర్టు న్యాయాధికారి జస్టిస్ కె.శరత్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు ఖమ్మం బార్ అసోసియేషన్‌కు వచ్చి న్యాయవాదులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు వెంపటి అపర్ణ, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, బిక్కం రజని, ఏపూరి బిందుప్రియ, రాళ్ళబండి శాంతిలత, వినుకొండ మాధవి, బార్‌అసోసియేషన్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, తదితరులున్నారు.



హైకోర్టు న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయాధికారులు

నిషేధిత గుట్కా పట్టివేత

టేకులపల్లి, ఆగస్టు 17: టేకులపల్లి మండల కేంద్రంలో పలు కిరాణ దుకాణాల్లో శనివారం టేకులపల్లి ఎస్ఐ పి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పోలీసుల దాడుల్లో భాగంగా ఓ దుకాణం గోడౌన్‌లో అక్రమంగా నిల్వచేసిన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ గుట్కాప్యాకెట్లను పోలీసు స్టేషన్‌కు తరలించి, కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

కొత్తగూడెం వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు17: కొత్తగూడెం వైద్య కళాశాలలో 19 క్యాటగిరీలలో 105 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి ఇంటర్వ్యూలను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ప్రొఫెసర్లు -10, అసోసియేట్ ప్రొఫెసర్ - 35, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 16, ట్యూటర్లు - 22, సీనియర్ రెసిడెంట్లు - 22 మందిని భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీరికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్లో ఈ నెల 22వ తేదీన ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఇంటర్వ్యూలకు ఆసక్తి గల అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

నగరంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు17: నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిపై ఖమ్మంటుటౌన్ పోలీసుస్టేషన్ నందు శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంరురల్ మండలం పెద్దతండాకు చెందిన స్వాతి నిండు గర్భిణీ కావడంతో గతనెల 27న ప్రసవం కోసం నెహ్రూనగర్‌లోని ఓ ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రిలో జాయిన్ చేసుకున్న సిబ్బంది సీజేరియన్ చేసి పాపపుట్టిందని, క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులకు తెలిపారు. అదేరోజు రాత్రి స్వాతికి సీరియస్‌గా ఉందని ప్లేట్‌లెట్స్ తగ్గిపోయయని, ఎక్కించాలని అదేవిధంగా హైదరాబాదుకు తరలించాలని సూచించారు. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాదులోని ఓ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరిశీలించి ఖమ్మంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దీంతో పరిస్థితి విషమంగా మారిందన్నారు. దీంతో ఖర్చు ఎక్కువ అయిందని, మళ్లీ సర్జరీ చేయాలని వైద్యులు తెలపడంతో ఖమ్మానికి చెందిన ఆసుపత్రిపై స్వాతి మామ సురేందర్‌రెడ్డి టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న కిడ్నీ బాధితులు

భారంగా మారుతున్న చికిత్స ఖర్చు



ఖమ్మంలో డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ బాధితులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 17: - మానవ శరీరంలో మూత్ర పిండాలు అత్యంత కీలకం. వాటి పనితీరు బాగుంటేనే రక్తశుద్ధి జరిగి మిగిలిన అవయవాలు సక్రమంగా పనిచేస్తాయి. మారిన జీవన శైలి.. ఆహార అలవాట్లు, తాగే నీరు కలుషితం, విచ్చల విడిగా మందులు వాడటంతో మూత్రపిండాలపై తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నాయి. కిడ్నీ రోగుల సంఖ్య ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్రమంగా పెరుగుతోంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఒకప్పుడు పదుల సంఖ్యలో ఉండేవారు. కాని నేడు అన్ని వర్గాల్లో పెరిగిన మానసిక ఒత్తిడి, మారిన జీవనశైలి, మధుమేహం, రక్తపోటు పెరగడం, వైద్యుల సలహాలు లేకుండా విచ్చల విడిగా నొప్పుల మందులు, యాంటిబయాటిక్ వాడకం పెరగడంతో మూత్రపిండాలపై ప్రభావం పడుతోంది. దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు (బీపీ), మధుమేహం నిర్లక్ష్యం చేయడం, మందులు వాడకుండా ఆ జబ్బులు పెరిగి శరీరంలో మూత్రపిండాలపై ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతు న్నారు.. గ్రామాల్లో ఎక్కువగా నొప్పుల కోసం వైద్యుల సలహాలు లేకుండా ఎక్కువ తీవ్రత ఉన్న మందులు వాడుతున్నారు. ఆ మందులు వాడటంతో మూత్ర పిండాలు దెబ్బ తింటున్నాయి. జిల్లాలో ప్రస్తుతం డయాలసిస్ కు వరకు వచ్చిన బాధితుల్లో వారే ఎక్కువగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ఖమ్మం పట్టణానికి చెందిన భాగ్యమ్మ అనే మహిళ ఆరు నెలల క్రితం ఉన్నట్లుండి వాంతులు చేసుకుంది. మందులు వేసుకున్నా తగ్గక పోవడంతో డాక్టర్‌ను సంప్రదించింది. క్రియాటినిన్ టెస్ట్ చేయించగా 9.5 ఉన్నట్లు తేలింది. నిర్ధారణ కోసం మరో కార్పొరేట్ ఆసుపత్రిలో పరీక్ష జరిపించగా 14 ఉంది. రెండు మూత్రపిండాలు చెడిపోయాయని వైద్యులు తేల్చడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం డయాలసిస్ మీదనే జీవిస్తోంది.

- ఖమ్మం రూరల్ మండలం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పదేళ్లగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు రోజులకు ఒకసారి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇప్పటి వరకు రూ.లక్షల్లో డబ్బులు ఖర్చు చేశాడు. కిడ్నీ దాత కోసం కొన్నేళ్లగా ఎదురు చూస్తున్నాడు. అతడికి బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నాయి. ఇలా వందల సంఖ్యలో పేదలు మూత్ర పిండాల వ్యాధికి గురై లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

ఆసుపత్రి	భద్రాచలం	కొత్తగూడెం	మణుగూరు	ఇల్లెందు	అశ్వారావుపేట	సత్తుపల్లి	ఖమ్మం	మమత	శ్రీరక్ష
యూనిట్లు	10	5	5	5	5	5	22	5	20
చికిత్స పొందుతున్న వారు	86	43	30	42	19	45	164	26	120

అతిగా మందులు వాడొద్దు

- డాక్టర్ రాఘవేంద్రరావు, కిడ్నీవైద్య నిపుణులు



వైద్యుల సలహాలు లేకుండా నొప్పులు, ఇతర జబ్బులకు విచ్చలవిడిగా మందులు వాడొద్దు. దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, బీపీని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీకి ముప్పు వాటిల్లుతోంది. నెలనెలా పరీక్షలు చేయించుకుంటూ డాక్టర్లు రాసిన మందులు వాడుతూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. ముందస్తుగానే లక్షణాలను గుర్తించి వెంటనే వైద్యులను సంప్రందించి చికిత్స చేయించుకోవాలి.

గుండెపోటుతో రైతు మృతి

వైరా, ఆగస్టు 17: గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన వైరా మునిసిపాలిటీ పదోవార్డు సోమవరంలో శనివారం జరిగింది. పదోవార్డు సోమవరానికి చెందిన కొల్లి వెంకయ్య(65)అనే రైతు తన పొలంలో నాటు వేసిన అనంతరం ఇంటికొచ్చి మంచినీళ్లు తాగి మంచంలో కూర్చొన్న వెంటనే కుప్పకూలిపోయాడు. స్థానిక ఆర్ఎంపీ సీపీఆర్ చేసి చికిత్స నిమిత్తం వైరాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ డి.కోటయ్య నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పదోవార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని, నాయకులు గొల్లపూడి కృష్ణారావు, పొదిల హరినాథ్, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, కర్నాటి హన్మంతరావు, మేడిశెట్టి కృష్ణ, కొల్లి రమేష్, కోసూరి శ్రీను మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



వెంకయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్...

కల్లూరు, ఆగస్టు17: వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రైల్వే ప్రమాదంలో కల్లూరుకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు.. కల్లూరులోని యూపీఎస్ రహదారి వైపునకు చెందిన ఎస్‌కే పాషా ఉస్సేన్ బీ దంపతులకు చెందిన పెద్దకుమారుడు ఎస్‌కే సలీం(18) శుక్రవారం రాత్రి ఎలక్ట్రీషియన్ పని నిమిత్తం హైదరాబాద్‌కు తన ఇంటి నుంచి బయలు దేరి వెళ్లాడు, ఆ క్రమంలో రైలు ప్రయాణం చేస్తున్న సలీం ఆకస్మాత్తుగా కాలు జారి పట్టాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో సలీం తల్లి ఫోన్‌కాల్ చేయడంతో రైల్వే పోలీసులు కాల్ లిఫ్ట్ చేశారు. దీంతో ప్రమాద ఘటనపై సదరు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జీవనోపాధి కోసం వెళ్లిన తన కుమారుడు ఇలా ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదన మిన్నట్టుకుంది. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కల్లూరుకు తీసుకువచ్చారని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



ఈశ్వర్(ఫైల్)

దుమ్ముగూడెం ఆగస్టు17: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన చర్లలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని భీమవరానికి చెందిన డిగ్రీ విద్యార్థి అపకా ఈశ్వర్(22) ఈనెల 16న వెంకటాపురం వెళ్లి, స్వగ్రామానికి శనివారం తన ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో దేవరపల్లి-మామిడిగూడెం మధ్యలో కల్వర్టుకు ఢీకొట్టాడు. సత్యనారాయణపురంలో ప్రాథమిక చికిత్సల అనంతరం భద్రాచలం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతి చెందిన విద్యార్థి ఈశ్వర్ పాల్వంచ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఈయర్ చదువుతున్నాడు.

హమాలీ పై కానిస్టేబుల్ దాడి..

ఖమ్మం క్రైం,ఆగస్టు17: ఉల్లిగడ్డలు లోడ్‌ను దిపేందుకు లారీ ఓదుకాణం ముందు నిలపడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో అక్కడ ఉన్న ఓకానిస్టేబుల్ అక్కడకు వచ్చి లారీను పక్కకు పెట్టింస్తున్న హమాలీపై దాడి చేయడంతో గాయపడ్డాడు. ఈ క్రమంలో ప్రతి రోజు మామూళ్లు తీసుకుంటున్నారు మళ్లీ హమాలీను కొడతారా అంటూ యజమానులు తిరగబడ్డారు. దీంతో ఆ కానిస్టేబుల్ గాయపడిన హమాలీను ఆసుపత్రికి తరలించారు. కాగా ఓహెడ్ కానిస్టేబుల్ అక్కడకు వచ్చి యజమానులను, హమాలీలను సముదాయించినట్టు తెలిసింది.

రైలు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

మధిరరూరల్, ఆగస్టు17: మండల పరిధిలోని దెందుకూరు- తొండలగోపారం రైల్వేస్టేషన్ల మధ్య కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఢిల్లీకి చెందిన రవి శనివారం ఢిల్లీ వైపు నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. మధిర-తొండలగోపారం రైల్వేస్టేషన్ల మధ్య దిగువ లైన్‌పై రైలులోనుంచి జారిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. రైల్వే పోలీసులు ఆర్ఫౌండేషన్ సహకారంతో రవిని ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 17: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో శనివారం లభ్యమైంది. పోస్టాఫీస్ సెంటర్‌లో ని సెయింట్ మేరీస్ స్కూల్ ఎదురుగా ఉన్న సురక్ష ఒకేషనల్ జూనియర్ కళాశాల లైన్‌లో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్ఐ 87126 82020 నెంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు.

ఆర్థికసాయం పేరుతో సైబర్ మోసం

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 17: సైబర్ నేరగాళ్లు నిత్యం ఏదో ఒక రూపంలో పలువురిని మోసం చేస్తూనే ఉన్నారు. తాజాగా శనివారం అశ్వారావుపేటలో ఓ వ్యక్తిని ట్రస్ట్ పేరుతో సాయం అంటూ మోసం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ వాట్సాప్ గ్రూప్‌లోని చొరబడిన సైబర్ నేరగాళ్లు గ్రూప్ పేరును హర్షసాయి ట్రస్ట్‌గా మార్చారు. రూ.2 వేలు చెల్లించిన వారికి రూ.18,500సాయం చేస్తామంటూ మెసేజ్‌లు పంపారు. అవకాశం కొద్దిమందికి మాత్రమేనని, ఆలస్యం చేస్తే డబ్బులు వేయం అంటూ కంగారు పెట్టారు. ఇందుకు ఇద్దరి ముగ్గురు వ్యక్తులు కృతజ్ఞతలు తెలిపిన మెసెజ్‌లు కూడా పంపారు. ఇదే తరుణంలో పట్టణానికి చెందిన రఫీ అనే వ్యక్తి రూ.2వేలను కేటుగాళ్లు పంపిన స్కానర్‌కు పంపారు. రూ.2వేలు చెల్లించిన తరువాత అతడి నెంబర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. దీంతో తాను మోసపోయాయని గ్రహించి లబోదిబోమన్నాడు. అపరిచిత వ్యక్తులు పంపిన లింక్‌లు ఓపెన్ చేయడం ద్వారా మోసపోతారని, అటువంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

1,630 రోజులు మృత్యువుతో పోరాడి..

ఆగిన ఆఖరి శ్వాస

తల్లాడ, ఆగస్టు 17: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లి 1630రోజులపాటు మృత్యువుతో పోరాడిన వ్యక్తి ఆఖరి శ్వాస ఆగింది. మల్లవరం గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు(49) శనివారం తుదిశ్వాస విడిచాడు. 2020 మార్చి ఏడోతేదీన తల్లాడ మండలం బాలపేట గ్రామంలో ఉన్న పొలం వద్దకు స్కూటీపై వెంకటేశ్వరరావు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా స్కూటీని మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు తలకు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్‌ల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకువెళ్లి చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పు లేకుండాపోయింది. వైద్యం కోసం కుటుంబసభ్యులు ఎకరం పొలం అమ్మి సుమారు రూ.40లక్షల మేరకు ఖర్చుచేశారు. అప్పట్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.ఏడులక్షలు మంజూరయ్యాయి. కాగా ఇంతకాలం అచేతన స్థితిలో ఉండి ఫలి తం లేకపోవడంతో వైద్యులు వెంకటేశ్వరరావు అన్నవాహికకు సర్జరీ చేసి రంధ్రం ఏర్పాటుచేశారు. జ్యూస్‌ల ద్వారానే ఇంతకాలం జీవిస్తూ శనివారం మృతి చెందాడు. మృతిడికి ఇద్దరు కుమారులున్నారు. వెంకటేశ్వరరావు మృతితో మల్లవరంలో విషాదం నెలకొంది.

నిల్వ ఉంచిన ఇసుక గుర్తింపు

ములకలపల్లి, ఆగస్టు 17: అక్రమంగా నిల్వ ఉంచి ఇసుక అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పూసుగూడెం రెవెన్యూ గ్రామంలో సంజీవపల్లి గ్రామం లాకావత్ రాంబాబు ఇంటి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను శుక్రవారం గుర్తించినట్లు తెలిపారు. మండల గిర్దావర్ 8 ట్రాక్టర్లు, 24 క్యూబిక్‌మీటర్ల ఇసుకను సీజ్‌చేసి స్వాధీనపర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిల్వ ఉంచిన ఇసుకను వేలం వేయడం జరుగుతుందని, ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీ తహసీల్దార్ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.


పారిపోయిన ముగ్గురు ఆశ్రమ విద్యార్థులు

● ఆచూకీ దొరకడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

దుమ్ముగూడెం ఆగస్టు17: మండల పరిధి లక్ష్మీనగరంలో నిర్వహిస్తున్న సీతారాంపురం ఏకలవ్య మోడల్ పాఠశాలకు చెందిన ఇద్దరు, నారాయణరావుపేట గిరిజన బాలుర ఆశ్రమపాఠశాలకు చెందిన ఒక విద్యార్థి శనివారం తమ ఇళ్లకు పారిపోయేందుకు ప్రయత్నించారు. వీరిలో ఇద్దరు ఇళ్లకు చేరుకోగా, మరొక విద్యార్థి మార్గమధ్యలో బంధువుల ఇంటి వద్ద పట్టుబడ్డాడు. ఏకలవ్యలో చదువుతున్న పాయం మనోహర్, ఇర్పా నరేంద్రలు పాఠశాల నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండా గోడ దూకి ఇళ్లకు పారిపోయారు. వీరిలో ఒకరిది ఆర్లగూడెం కాగా, మరొకరిది అడవిరామవరం. విషయం తెలుసుకున్న ఏకలవ్య సిబ్బంది వీరి ఆచూకీ కోసం వెతకగా, ఇద్దరూ వారి వారి ఇళ్లకు చేరుకోవడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే నారాయణరావుపేట ఆశ్రమపాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తెల్లం విష్ణు సైతం ఎవరికీ చెప్పకుండా తన స్వగ్రామం మణుగూరుకు బయల్దేరాడు. విషయం తెలిసి అప్రమత్తమైన ఆశ్రమపాఠశాల సిబ్బంది వెంటనే అతడిని వెతికేందుకు బయల్దేరారు. ఏపీ రాష్ట్రం కన్నాయిగూడెంలోని తన బంధువుల ఇంటి వద్ద ఉన్నాడని తెలుసుకొని వెంటనే విద్యార్థి విష్ణును ఆశ్రమపాఠశాలకు తరలించారు. ఏకలవ్య ప్రిన్సిపాల్ వివరణ ఇస్తూ, శనివారం తెల్లవారుజామున పాఠశాల గోడ దూకి పారిపోయిన ఇద్దరు విద్యార్థుల కోసం వెతకగా, వారిద్దరూ ఇళ్ల వద్ద క్షేమంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సదరు విద్యార్థులపై చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణరావుపేట ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎటువంటి అనుమతి లేకుండా వెళ్లిన విష్ణు ఆచూకీను గుర్తించి ఆశ్రమపాఠశాలకు తీసుకొచ్చామని తెలిపారు. వరుసగా రెండు రోజులు సెలవులు ఉండడంతో చెప్పకుండా ఇంటికి వెళ్లే ప్రయత్నం చేశాడని తెలిపారు.

కారులో మంటలు ... తప్పిన ప్రమాదం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు17: కారులో మంటలు ఎగిసిపడడంతో కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ కార్తీక్ సమయస్ఫూర్తితో స్పందించడంతో శనివారం పెను ప్రమాదం తప్పింది. బస్టాండ్ సెంటర్ నుంచి పోస్ట్ ఆఫీస్ వైపు వెళ్తున్న ఓ కంపెనీకి చెందిన నూతన కారును కొనుగోలు చేసి వెళ్తున్న యజమాని భానెట్‌లో మంటలు వచ్చాయి. దీంతో వాహన యజమాని కిందకి దిగాడు. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ కార్తీక్, వన్‌టౌన్ పోలీసులు, ఆటో స్టాండ్‌లో ఉన్న డ్రైవర్లు నీళ్లను చల్లి మంటలను ఆర్పారు. సమయస్ఫూర్తి ప్రదర్శించిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను స్థానికులు అభినందించారు.



పలు కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుడు దయానంద్ పరామర్శ



కల్లూరు, ఆగస్టు 17: కల్లూరులో క్రిసెంట్ ఫార్మాకంపెనీ అధినేత ఎస్‌కే. జానీమియా మాతృమూర్తి రబియా మృతి చెందటం తెలిసిందే.. దీంతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ శనివారం జానీమియా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా మండలంలోని కొర్లగూడెంలో కాంగ్రెస్ నాయకుడు మట్టా రామకృష్ణ బాబాయి నాగేశ్వరరావు ఆనారోగ్యంతో మృతి చెందగా నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు భూక్యా శివకుమార్, తోటకూర రామకృష్ణ, ఆళ్ల నరిసింహారావు, ధరవత్ మోహన్‌నాయక్, బైర్ల కాంతరావు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థిని హత్యాచారంపై ఆగ్రహజ్వాల

- జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది నిరసన
- కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్



వైరాలో మదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు17: కలకత్తాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారం చేయటం ఆధునిక కాలంలోను అటవిక చర్యని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి తీవ్రంగా ఖండించారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన పీవోడబ్ల్యూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. గట్టయ్య సెంటర్‌లో ఉన్మాది దిష్టిబొమ్మను దహనం చేశారు. నిర్భయ వంటి చట్టాలను రూపొందించటం కాదని, వాటిని ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత, శోభ,ఝాన్సీ, వనతి, శారద, జాస్మీన్, ఉమా పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో

వైద్య విద్యార్థినిపై సామూహిక హత్యాచారాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ఖండించారు. విద్యార్థులతో కలిసి ఖమ్మంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్, అధ్యక్షుడు టీ లక్ష్మణ్, రాజేశ్వరి, మౌనిక, అనిత పాల్గొన్నారు.

ఓపీ సేవలను నిలిపి వేత

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వైద్యులు, సిబ్బంది ఓపి సేవలను నిలిపివేశారు. ఓపీ సేవలను నిలిపి వేయటంతో పాటుగా పీఎస్సార్ సెంటర్లో ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ రాజేష్ , డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ శిరీష, డాక్టర్ అశోక్, డాక్టర్ సంఘమిత్ర, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులు, వైద్యసిబ్బంది నిరసన

కారేపల్లి: మండలవ్యాప్తింగా వైద్యులు, వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ప్రభుత్వవైద్యశాల సిబ్బందితోపాటు మండల వ్యాప్తింగా 14 పల్లెదవాఖానులలో పనిచేసే వైద్యులు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కారేపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

నల్లబ్యాడ్జిలతో నిరసన

బోనకల్: కలకత్తాలో ఇటీవల డ్యూటీ డాక్టర్ పై జరిగిన హత్యాచార, హత్య ఘటన పట్ల శనివారం మండల వైద్య సిబ్బంది ప్రశాంత్, కావ్య తదితరులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులను రక్షించేందుకు గానూ కఠినమైన చట్టాన్ని తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దానయ్య, ఉదయశ్రీ, రాధాలత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిరసన ర్యాలీ

తల్లాడ: కోల్‌కత్తాలో జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ తల్లాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రత్నమనోహర్, పల్లెదవాఖానా వైద్యులు శ్రీకాంత్, గోపి, నిర్మల, నిష్మా, విజయచందర్, మహేశ్వరరావు,హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, శిరీష, జ్యోతి, కృష్ణ, కుమారి పాల్గొన్నారు.

ఓపీ సేవలు బంద్

వైరా: వైరాలోని ప్రైవేట్ ఆసుపత్రిలో 24గంటలు ఓపీ సేవలు బంద్ చేశారు. ఇదే సమయంలో ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు వైరాలోని డాక్టర్లు, నర్సులు, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవసంస్థల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మదర్ థెరిస్సా విగ్రహానికి నివాళులర్పించారు. ఐద్వా ఆధ్వర్యంలో కూడా ఈ ఘటనపై నిరసన ర్యాలీ నిర్వహించారు. వైరా మునిసిపల్ ఛైర్మన్, వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, డాక్టర్లు డి.కోటయ్య, కాపా మురళీకృష్ణ, రాజేశ్వరి, పెరుమాళ్ల కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రావు, మోహన్‌రావు, భార్గవ, ఆశాజ్యోతి, హరిత, అరుణలక్ష్మీ, ఉంద్రు శ్యాంబాబు, సీనియర్ జర్నలిస్టు పారుపల్లి కృష్ణారావు, ఐదోవార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఐద్వా నాయకురాళ్లు పాల్గొన్నారు.

పటిష్ఠమైన చట్టాలను అమలు చేయాలి

సత్తుపల్లిరూరల్: కలకత్తా వైద్యురాలి హత్య చేయడం లాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చట్టాలను అమలు చేయాలని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్రభుత్వాలను కోరారు. కలకత్తా ఘటనకు నిరసనగా సత్తుపల్లి ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై దాడులు పెరుగుతున్నాయని, ప్రజారోగ్యం కోసం నిద్రాహారాలు మాని, కుటుంబాలను వదిలేసి సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు బీ.సురేష్, ప్రణయ్, రాజేష్, సాత్విక్, సాంబశివరావు, జయలక్ష్మీ, గ్రీష్మ, ఎన్ఎస్ విజయలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘ నాయకులు ఎండీ.అలీ, విష్ణువర్ధన్, ఎంఏ.రహీం, టీ.రంగారావు, మేకల నరసింహారావు, ఆర్కేరాజు, నరేంద్రబాబు, బాబూరావు, రాజేష్, రఫీ, రాము, శ్రీను, సురేష్‌లు దాడులపై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

కఠినంగా శిక్షించాలి

ముదిగొండ: హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ముదిగొండలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు, యూత్ సభ్యులు కళాశాల నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపేందర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని కళాశాల విద్యార్థుల కొవ్వొత్తులతో ర్యాలీ

ఖమ్మంరూరల్: మండలపరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం సాయంత్రం పెద్దతండాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడారు. మానవ మృగాలను కఠినంగా శిక్షించాలన్నారు. దేశం మొత్తం ఇటువంటి దుర్ఘటనలపై పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ

ఖమ్మంటౌన్: కలకత్తాలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిపిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులపై జరుగుతున్న దాడులకు రక్షణగా సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు తాటి వేంకటేశ్వర్లు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, ఇటికాల రామకృష్ణ,యానాల సాంబశివారెడ్డి, గాదె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కాగా జూనియర్ వైద్యురాలి చిత్రపటానికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం నివాళులు అర్పించారు. ఆర్‌బీ గెస్ట్‌హౌజ్ ఎదురుగా జరిగిన ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, జిల్లా కార్యదర్శి వీ. వేంకటేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు టీ.లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

మహిళా సంఘాలు పోరాటం చేయాలి

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



సత్తుపల్లిరూరల్, ఆగస్టు17: కలకత్తా దుర్ఘటనపై మహిళా సంఘాలు ముక్తకంఠంగా ఖండిస్తూ న్యాయం జరిగేవరకు పోరాటం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. కలకత్తా ఘటనపై నిరసనగా పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నిజానిజాలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించి వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు. వైద్యులపై దేశంలో దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, నిద్రాహారాలు మాని నిరంతరం రోగుల సేవకోసం పరితపిస్తున్నారని, సమాజంలో డాక్టర్లు అంటేనే చెడు అభిప్రాయం ఉందని, అది సరికాదన్నారు. ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మారుమూల ప్రాంతాలలో మహిళా వైద్యులు ఎంతమందో వైద్య వృత్తిలో ఉన్నారని, డాక్టర్ల రక్షణ కోసం చట్టాలు రూపొందించేలా ముఖ్యమంత్రి, మహిళా మంత్రులకు వినతిపత్రాలు అందిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్, పీ.వసుమతిదేవి, రమాకాంత్, నల్లమల కిరణ్, స్రవంతి, శివకృష్ణ, బీవీ.రెడ్డి, అశోక్, హర్షిత్, సీతారామారావు, శివాజీ, రామ్‌నరేష్, పెద్దిరాజు, సురేష్ రామాల, స్నిగ్ధ, మౌలాలీ, తులసి, సాంబశివరావు, రాజీవ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాలో రేపు 'ఓరియంటేషన్'

సత్తుపల్లి, ఆగస్టు17: ఈనెల19న మండలంలోని కొత్తూరులోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ సీనియర్ ప్రొఫెసర్ డా.ఏబీవీ.రమణయ్య ఇంజనీరింగ్ విద్య ఆవశ్యకతను వివరించనున్నట్లు చెప్పారు. అనుభవాలు, ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో కొలువులు ఎలా సాధించాలో దిశానిర్దేశం చేస్తారని, విద్యార్థులు, తల్లీదండ్రులు హాజరవ్వాలని కోరారు.

దివ్యాంగుల రుణాలకు లాటరీ: ఐదుగురి ఎంపిక



ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు17: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో దివ్యాంగులకు రుణాలను అందించేందుకు గతంలో దరఖాస్తులు చేసిన వారికి శనివారం లాటరీ నిర్వహించారు. వీరిలో ఐదుగురిని ఎంపిక చేశారు. రూ.3లక్షల విలువ కలిగిన యూనిట్‌లు రెండు మంజూరు కాగా 47 మంది దరఖాస్తులు చేశారు. రూ.50వేల విలువ కలిగిన మూడుయూనిట్లుకు 106మంది దరఖాస్తులు చేశారు. రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మేనేజరు విజయానంద్, మెప్మా పీఎమ్‌సీ సుజాత, బ్యాంకర్లు ఆధ్వర్యంలో లాటరీ విధానంలో ఎంపి కలను పూర్తి చేశారు. ఐదుగురు జాబితాలను బ్యాంకర్లకు సిఫారస్సు చేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, కంపాక్స్‌ల పంపిణీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు17: సుధాహెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని సత్యంపేట, బంగ్లాబజార్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 62 మందికి నోట్‌బుక్స్ కంబాక్సులను శనివారం పంపిణీ చేసినట్లు ఫౌండర్ కొనకళ్ల సుధారాణి తెలిపారు. మంచిగా చదివి ఉన్నతంగా ఎదిగాలని ఆకాంక్షించారు.

వైద్య శిబిరంలో 75మంది పరీక్షలు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు17: సింగరేణి ప్రభావిత ప్రాంతమైన కిష్టారం లోని అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 75మందికి పరీక్షలు నిర్వహించి జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీవో ఎంవీ.నరసింహారావు, వైద్యులు బీ.నరసింహారావు, శిరీష, సందీప్, రవి, రాజు, ఈశ్వర్, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

తిరుమలాయపాలెం, ఆగస్టు17: గ్రామాల్లో ప్రస్తుత తరుణంలో పలురకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దీనిపట్ల వివిధశాఖల సిబ్బంది అప్రమత్తం గా ఉండి తగు చర్యలు చేపట్టాలని లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ ఆర్.సన్యాసయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే డెంగీ, మలేరియా, విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ఎప్పటి కప్పుడు సిబ్బంది స్పదించి చర్యల తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీసీఈవో నాగలక్ష్మి, డీఎస్‌వో రాంబాబు, తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, వైద్యాధికారులు వసుంధర, అలివేలు, ఏవో సీతారాంరెడ్డి, ఏఎంలు నాగలక్ష్మి, విజయలక్ష్మి, ఉండేటి మణి పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

వేంసూరు,ఆగస్టు17:ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మట్టా ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం వేంసూరులో మండల అధ్యక్షుడు పర్సా రాంబాబు అధ్యక్షతన జరిగిన మండలస్థాయి సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో తుమ్మూరు చంద్రమోహన్‌రెడ్డి, మాదిరాజు శ్రీనివాస్, పాల నాగసురేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరావు, చల్లా అప్పిరెడ్డి, మూడ్ సీతారాం, దశరథ్ పాల్గొన్నారు.

కాల్వకు స్వచ్ఛందంగా మరమ్మతులు

వైరా, ఆగస్టు 17: వైరా రిజర్వాయర్ ప్రధాన ఎడమకాల్వ పరిధిలోని లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌ను లింగన్నపాలెం రైతులు స్వచ్ఛందంగా బాగుచేసుకున్నారు. విప్పలమడక, నారపనేనిపల్లి మధ్యనుంచి ప్రధాన ఎడమకాల్వ లింగన్నపాలెం, గరికపాడు కాల్వలుగా చీలిపోతాయి. అయితే లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్ పూడిక, చెత్తాచెదారంతో నిండిపోయింది. దాంతో లింగన్నపాలెం రైతులు విరాళాలు వసూలు చేసుకొని శనివారం స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్‌తో పూడిక తొలగింపు పనులు చేపట్టారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

మధిరటౌన్, ఆగస్టు17: కల్లూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబులు పోతగాని వెంకటకృష్ణ కుటుంబ సభ్యులకు తోటి కానిస్టేబుళ్లు నగదు అందజేశారు. శనివారం మధిరలో దశదిన ఖర్మకు హాజరైన తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు వెంకటకృష్ణ భార్యకు లక్షాయాభైవేలు, తల్లికి 50వేలు అందజేశారు.

సీఐ రాజిరెడ్డికి సన్మానం



సీఐ రాజిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్‌నాయకులు

ఖమ్మంరూరల్, ఆగస్టు 17: ఖమ్మం రూరల్ సీఐ గా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న సీఐ రాజిరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తల్లంపాడు మాజీ సర్పంచ్ యరసాని శివశంకర్ రెడ్డి, నాయకులు మద్ది వీరారెడ్డి, భైరు హరినాదబాబు, శ్రీనివాస్, రవి, సురేష్ నాయక్, పాపా నాయక్, వెంకటరెడ్డి, బుజంగరెడ్డి, రవి, అంబేద్కర్, వెంకటనారాయణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ పొలంబాట

కల్లూరు,ఆగస్టు17: మండలంలోని మర్లపాడులో శనివారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పెనుబల్లి ఏడీఈ ఎం యాదగిరి విద్యుత్ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు భద్రత సూత్రాలు, విద్యుత్ పొదుపు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకోరుకొండి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ జి తిరుపతయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల వసతి గృహాల సందర్శన

సత్తుపల్లిరూరల్, ఆగస్టు17: మండలంలోని కిష్టారంలోని హైస్కూల్, బీసీ బాలుర వసతిగృహాలను ఏబీవీపీ, బీజేపీ నాయకులు శనివారం సందర్శించారు. సమస్యలను తెలుసుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నూతన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు శ్రీనివాస్,బాణోత్ విజయ్,శివ, శేషగిరి కోరుతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడలు

ఖమ్మంరూరల్,ఆగస్టు17: మండల పరిదిలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం అనంతరం క్రీడలు నిర్వహించారు. మహిళలకు రిక్రియేషన్ బాల్‌గేమ్ పురుషులకు చెస్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రధానోపాధ్యాయులు శ్యాంసన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నబీరవల్లిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

బోనకల్, ఆగస్టు 17: మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో శనివారం కేవీఆర్ ఎమర్జెన్సీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఇటీవల సీజనల్ వ్యాధుల నేపథ్యంలో 500 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, మాజీ ఎంపీటీసీ చంద్ర శ్రీలక్ష్మీ, శాంతయ్య, యెహాన్, బాలరాజు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలు అమలు చేయాలి: మాస్‌లైన్

ఖమ్మం రూరల్, ఆగస్టు17: ఆరుగ్యారంటీలు అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్రనాయకుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎంవీపాలెంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు.ఈనెల 22న హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి వెంకయ్య, జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి మారుతి మల్లయ్య పాల్గొన్నారు.అన్ని

శాకంబరి అలంకారంలో శ్రీదేవి భూదేవి



ఎర్రుపాలెం, ఆగస్టు17: జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు ముత్యాల కవచం, శ్రీపద్మావతి, అలివేలు మంగమ్మ శాకంబరీఅలంకారంలో శనివారం దర్శనమిచ్చారు. శ్రావణ మాసంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అనంతరం శాకాంబరీ అలంకారం చేయడం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు సమర్పించే కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకారం నిర్వహించి శాకంబరీ దేవిగా అర్చన నిర్వహించారు. భక్తులకు శ్రీ వెంకటేశ్వర అన్నదాన సత్రంలో సేవాసమితి నిర్వాహకులు అన్న గోవిందంలో భాగంగా ఉచితంగా అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకకర్త ఉప్పల శ్రీనివాసశర్మ, సుదర్శన్ శర్మ, కాసులనాటి రామకృష్ణశాస్త్రి, సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, బొబ్బా కిరణ్, వి.వెంకటకృష్ణారావు, లీలాకృష్ణ, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



వైరా,ఆగస్టు17: రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని బ్రహ్మకుమారీ సభ్యులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఉన్న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారీ సభ్యుల్లో ఒకరైన గీత రాఖీ కట్టగా ఎమ్మెల్యే ఆమెను ఆశీర్వదించారు. రాఖీ పౌర్ణమి అన్నా చెల్లెళ్ల ప్రేమకు ప్రతీకగా జరుపు కోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బ్రహ్మకుమారీ సభ్యుడు హన్మంతరావు, కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, ధార్న రాజశేఖర్ పాల్గొన్నారు.

వీరభద్రానికి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడి నివాళి



వీరభద్రం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పువ్వాళ్ల

వైరా, ఆగస్టు 17: వైరా మునిసిపాలిటీ నాల్గోవార్డు ద్వారకా నగర్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పదిమల వీరభద్రరావు దశదినకర్మ శనివారం నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మునిసిపాలిటీ ఏడోవార్డులో మృతిచెందిన పణితి గోపాల్ మృతదేహానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులర్పించారు. మునిసిపాలిటీ 11వవార్డు సోమవరంలో ఇటీవల మృతిచెందిన వేముల దాసు, కంటెపూడి విజయ్(బాలశౌరి) చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, మాజీ వైస్‌ఎంపీపీ కట్ల రంగారావు, వైరా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు బోళ్ల గంగారావు, పణితి సైదులు, శ్రీను, పొదిల హరినాథ్, టీడీకే.రత్నం, మచ్చా బుజ్జీ, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, షేక్.ఖమ్మంమీరా, వాడపల్లి రామారావు, పమ్మి అశోక్ తదితరులు నివాళులర్పించారు.

సీతారామపై టీడీపీ వ్యాఖ్యలు సరికాదు: చల్లగుళ్ల

సత్తుపల్లి, ఆగస్టు17: సీతారామ ప్రాజెక్టు కేవలం సత్తుపల్లి ప్రాంతానికే ఉపయోగమని టీడీపీ నాయకులు అనడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్టు అంచనా విలువ రూ.18వేల కోట్లు అయితే ఇంకా రూ.11వేల కోట్ల పనులు మిగిలే ఉన్నాయని, డిస్ట్రిబ్యూటరీ కాలువలు పూర్తి చేస్తే గిరిజన ప్రాంతాలకు, జిల్లాలోని మైదాన ప్రాంతాలకు గోదావరి నీళ్ల పూర్తి వస్తాయన్నారు. అవకాశం ఉన్నందునే అత్యవసరంగా ఏన్కూర్ కాల్వ నిర్మాణం చేసి వైరా చెరువులోకి నీళ్ల వదలుతున్నారని, గతంలో సాగర్ నిండకపోవడంతో జిల్లాలో ఆయకట్టు బీడులుగా మారిందనే విషయాన్ని టీడీపీ గుర్తుంచు కోవాలన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో గోదావరి జలాలను జిల్లాకు రప్పిస్తుంటే అభినందించాల్సిన వారు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

బాధ్యతలు చేపట్టిన వైరా ఏవో



వైరా,ఆగస్టు17: వైరా మండల వ్యవసాయశాఖ అధికారిగా మయాన్ మంజుఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వైరా ఏవోగా పనిచేసిన ఎస్.పవన్‌కుమార్ జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కురవి మండల ఏవోగా ఉన్న మయాన్ మంజుఖాన్ బదిలీపై వచ్చారు.